క్లుప్తంగా

నేడు కంటి వైద్యశిబిరం

శాలిగౌరారం : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు డెంకెల సత్యనారాయణ శనివారం తెలిపారు. కంటి వైద్య శిబిరానికి వచ్చే వారు విధిగా తమవెంట ఆధార్‌కార్డ్ తెచ్చుకోవాలన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టూటౌన్ ఎస్‌ఐగా సైదులు బాధ్యతలు స్వీకరణ


ఎర్ర సైదులు

నల్లగొండ : పట్టణ టూటౌన్ ఎస్‌ఐగా ఎర్ర సైదులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2012వ బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో హుజూర్‌నగర్, సూర్యాపేట వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. ఆయనను టూటౌన్ ఎస్‌ఐగా బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన నాగరాజును నల్లగొండ వీఆర్‌కు బదిలీ చేశారు.

ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం


ప్రయాణస్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ

చండూరు : మండలంలోని తుమ్మలపల్లిలో రామలింగేశ్వరస్వామి దేవాలయం నూతన కమిటీ శనివారం ఆలయం ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్‌గా గున్‌రెడ్డి రమ్య, ధర్మకర్తలుగా బోయపల్లి రాములు, జిల్ల నర్సింహ, కురుపాటి వెంకటమ్మ, కారుమల్ల నర్సింహతో ఎండోమెంట్ కార్యనిర్వాహణ అధికారి అంబడి నాగిరెడ్డి, పరిశీలకులు సుమతి ప్రమాణస్వీకారం చేయించారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

కనగల్ : మండలంలోని రామచంద్రపురం గ్రామంలో ఏమిరెడ్డి నారాయణరెడ్డి, అనుముల చంద్రయ్య జ్ఞాపకార్థం పది రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. టోర్నమెంట్ విజేతగా చండూరు జట్టు నిలిచింది. రన్నరప్‌గా రామచంద్రపురం, 3వ స్థానంలో కురంపల్లి జట్టు నిలిచాయి. గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, 3వబహుమతి రూ.10వేలు మాజీ ఉపసర్పంచ్ వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి, అనుముల వెంకన్న అందజేశారు. కార్యక్రమంలో బలుగూరి పెద్దులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం


ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

మునుగోడు : మండలంలోని చొల్లేడు గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించేందుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బోరు వేయించి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, చొల్లేడు గ్రామశాఖ అధ్యక్షుడు బుడిగపాక రవి, మాజీ సర్పంచ్‌లు ముప్పు రవీందర్‌రెడ్డి, జనిగల మహేశ్వరిసైదులు, మాజీ ఎంపీటీసీ వనం నిర్మలయాదయ్య, కదిరే లింగస్వామి, జనిగల ముత్యాలు, మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

శివమాలధారుల ఇరుముడి


ఇరుముడిలో పాల్గొన్న శివమాలధారులు

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో గల శ్రీపార్వతీశంభులింగేశ్వరస్వామి దేవాలయంలో శనివారం దేవాలయ పూజారి వావిలాల రామలింగేశ్వరశర్మ నేతృత్వంలో శివమాలాధారణ భక్తుల ఇరుముడి కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఇరుముడి వేసుకొని మొక్కులు తీర్చుకునేందుకు శ్రీశైలం మల్లిఖార్జునస్వామి ఆలయానికి వెళ్లారు. శివమాలధారణ భక్తులకు వల్లాల గ్రామానికి చెందిన భూపతి ఉపేందర్ దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ధర్నాను జయప్రదం చేయాలి

రామగిరి(నల్లగొండ) : డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున కోరారు. శనివారం మండలంలోని దోమలపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట సైదులు, సత్యనారాయణ ఉన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అదే విధంగా పలువురు మాజీ మహిళా ప్రజాప్రతినిధులను ఆయా పార్టీల ఆధ్వర్యంలో సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు, విద్యార్థులకు ఆట పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

- సాక్షినెట్‌వర్క్


నకిరేకల్ : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం, మహిళా ప్రజాప్రతినిధులు


రామగిరి(నల్లగొండ) : మహిళా దినోత్సవంలో పాల్గొన్న వైద్యులు, అధ్యాపకులు


రామగిరి(నల్లగొండ) : సిబ్బందిని సన్మానించిన జడ్జి డి.దుర్గాప్రసాద్


రామగిరి(నల్లగొండ) : వేడుకలో పాల్గొని ఆర్టీసీ మహిళా సిబ్బంది


నల్లగొండ టౌన్ : మహిళలను సన్మానిస్తున్న పెన్షనర్లు


నకిరేకల్ : సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మంజుల


చిట్యాల : వేడుకల్లో పాల్గొన్న మహిళలు


నల్లగొండ టూటౌన్ : మహిళలను సన్మానిస్తున్న వర్షిత్‌రెడ్డి


నల్లగొండ : ఎస్‌టీయూ ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం


నల్లగొండ : యూటీఎఫ్ ఆధ్వర్యంలో..


కట్టంగూర్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ ప్రజా ప్రతినిధులు


నకిరేకల్ : పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..


రామగిరి (నల్లగొండ) : యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో ..


కేతేపల్లిలో కేక్ కట్ చేస్తున్న మహిళలు


నల్లగొండ టౌన్ : ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొని మాట్లాడుతున్న ప్రభావతి


శాలిగౌరారంలో మహిళలను సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు


మునుగోడు : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మహిళా వైద్యురాలికి సన్మానం

కే స్కిల్ యాప్ ఆవిష్కరణ


యాప్ ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

నల్లగొండ టౌన్ : సామాజిక అభ్యున్నతి కోసం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కోనం సాందీప్ స్వచ్ఛందంగా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన చాంబర్‌లో కోనం ఫౌండేషన్ వారు రూపొందించిన కే స్కిలు యాప్‌ను మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సాందీప్ కోనం, నిర్మాత దిల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పొట్లపల్లి లక్ష్మికి డాక్టరేట్


పొట్లపల్లి లక్ష్మి

మర్రిగూడ : మండల కేంద్రానికి చెందిన పొట్లపల్లి లక్ష్మి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఆమె ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ వివి.బసవరావు, సూపర్‌వైజర్ డాక్టర్ జి.విజయలక్ష్మి సమక్షంలో వివిధ మోడల్ ఔషదాలను ఉపయోగించి సమయోచిత ఔషద పంపిణీ కోసం మైక్రోస్పియర్లతో లోడ్ చేయబడిన ఎమల్జెల్స్ సూత్రీకరణ, మూల్యాంకణంపై చేసిన పరిశోధనకు గాను శుక్రవారం యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. లక్ష్మి డాక్టరేట్ పట్టా పొందడం పట్ల కుటుంబ సభ్యులతో పాటు మండల ప్రజలు అభినందించారు.

ఆలయంలో గాయత్రి మహాయజ్ఞం


పూజలు చేస్తున్న భక్తులు

నార్కట్‌పల్లి : మండలంలోని నైబాయిగూడెం గ్రామంలో శనివారం శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం తృతీయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు గుడెపూడి జానకిరామశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, నవగ్రహ పూజలతో పాటు పూర్ణాహుతి గాయత్రి మహాయజ్ఞం నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సోమ యుగేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సామ నరేందర్‌రెడ్డి, పాశం గోపాల్ రెడ్డి, కందకట్ల నర్సిరెడ్డి, పైళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జక్కలి గోపాల్, మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, యర్ర వెంకట్‌రెడ్డి, సోమ వెంకట్ రెడ్డి, సత్తిరెడ్డి, సత్తిరెడ్డి తదితరులున్నారు.

లోక్‌అదాలత్ సేవలను వినియోగించుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవర్


రాజీపత్రాలను అందజేస్తున్న జడ్జి మంజుల, పాల్గొన్న జడ్జి ఆరీఫ్, న్యాయవాదులు

నకిరేకల్ : లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని నకిరేకల్ సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవర్ అన్నారు. పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం అందుతుందన్నారు. స్థానిక మున్సిప్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫ్ మాట్లాడుతూ.. రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కారించుకుంటే ఇరువర్గాల వారికి మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ కేసులను రాజీకుదిర్చి వారికి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ కొండల్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య, న్యాయవాదులు అక్కెనపల్లి వీరస్వామి, విజయ్‌కుమార్, సోమయ్య, పాపయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలి


సోషల్ ఆడిట్‌లో పాల్గొన్న అధికారులు

చిట్యాల : ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పనులకు సంబంధించిన రికార్డులను, రిజిస్టర్, మస్టర్స్ నమోదును సక్రమంగా నిర్వహించాలని డీఆర్‌డీఏ ఏపీడీ నవీన్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ పనులపై నిర్వహించిన 15వ విడత సోషల్ ఆడిట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2023 ఏప్రిల్ 01నుంచి 2025 మార్చి 31వతేదీ వరకు చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు చేసిన పనులకు సంబంధించిన వివరాలను రికార్డుల్లో నమోదు చేయడం లేదని, చెల్లించిన డబ్బులకు సంబంధించి పే స్లిప్పులు ఇవ్వడం లేదని గుర్తించారు. అంతేకాకుండా గ్రామాల్లోని నర్సరీలలో పెంచుతున్న చెప్పిన మొక్కల సంఖ్యల్లో తేడాలున్నట్లు గుర్తించారు. అనంతరం ఏపీడీ నవీన్ కుమార్ మాట్లాడుతూ.. పనుల నిర్వహణలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, అలా చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో విజిలెన్స్ అధికారి ఫయాజ్, ఎస్‌ఆర్‌పీ వెంకన్న, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ మనోహర్, ఏపీఓ శ్రీలత, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

చండూరు : జగిత్యాల జిల్లా రాయికల్‌లో దళిత ఆశా వర్కర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని నెర్మట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఈరటి వెంకటయ్య, అంతిరెడ్డి, గ్రామ శాఖ కార్యదర్శి బల్లెం స్వామి, ఎస్‌కే. జహంగీర్, యాదయ్య, నరసింహ, వెంకన్న, లక్ష్మమ్మ, గణేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొమ్మగోని శంకరయ్య ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారిపడి గాయపడ్డాడు. దీంతో అతడికి ఖానా (కొండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థికసాయం శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాతి స్వామి, పోలగోని విజయ్, నాతి కాటమయ్య, అంతటి స్వామి, పామనగుళ్ల అచ్చాలు, కొండా వెంకన్న, మామిడి హనుమంతు, నాతి వెంకట్రామయ్య, కొమ్మగోని శంకరయ్య, అంతటి శ్రీనివాస్, అంతటి సత్తయ్య పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

చిట్యాల : మండలంలోని ఏపూరు గ్రామానికి చెందిన కూరాకుల ధనుంజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో అతడి స్నేహితులు శనివారం మృతుడి కుటుంబానికి రూ.6వేల నగదుతో పాటు రెండున్నర క్వింటాళ్ల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పాలెం శివకుమార్, నరేష్‌రెడ్డి, లింగస్వామి, శ్రీకాంత్, గణేష్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25శాతం రాయితీ

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలోని ప్లాట్‌ల యజమానులు ఈ నెల 31వతేదీ లోపు ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించిన వారికి 25శాతం ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వీరేందర్ శనివారం తెలిపారు. 2020లో రూ.1000 చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్‌కు రిజిస్టర్ చేసుకున్న ప్లాట్‌ల యజమానులు, తగిన అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్‌లను కొనుగోలు చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్లాట్‌లను రెగ్యులరైజ్ చేసుకోవాలని కోరారు.

ఏవీఎం విద్యార్థులకు రాష్ట్ర స్థాయి అవార్డు

నకిరేకల్ : హైదరాబాద్‌లో ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో నకిరేకల్‌లోని ఏవీఎం పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ కందాల స్వప్నారెడ్డి తెలిపారు. వారిలో 4వతరగతి విద్యార్థినులు ఉడుగు శ్రావ్య, మాద యశ్వసీని, 3వతరగతి విద్యార్థులు కందాల రిషబ్ నారాయణరెడ్డి, కందాల అభియ నారాయణరెడ్డి, 5వతరగతి విద్యార్థి చెట్టిపల్లి జోషఫ్ ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ స్వప్నారెడ్డి ఉత్తమ అవార్డు తీసుకున్నారు. శనివారం వారిని ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, అడ్మినిస్టేటర్ కందాల శ్రీకాంత్ రెడ్డి, జితేందర్‌రెడ్డి, భరత్ అభినందించారు.

నీటి కోసం తిప్పలు


ట్యాంకర్లతో నీటిని తెప్పించుకొని సంపులో నింపుకుంటున్న ప్రజలు

మునుగోడు : మండల కేంద్రంలోని చండూరు రోడ్డులో నివాసం ఉండే ప్రజలు మంచినీటిని కోసం పడరాని పాట్లు పడుతున్నారు. 18రోజులుగా గ్రామపంచాయతీ నీరు సరఫరా కాకపోవడంతో కొందరు ట్యాంకర్ల ద్వారా కొనుకొని తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. మరి కొందరు తమ చుట్టూ పక్కల ఇళ్ల వారి నుంచి నీరు తెచ్చుకొని వాడుకుంటున్నారు. ఆ రోడ్డులో కొద్దిరోజులుగా డ్రెయినేజీ కాల్వల నిర్మాణం చేపడుతుండడంతో పైపులు పగిలి ఆ ప్రాంతంలోని ఇళ్లకు పూర్తిగా నీటి సరఫరా నిలిచిపోయింది. కానీ ఇప్పటి వరకు ఆ పైపులైన్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో దాదాపు 50ఇళ్లలో నివాసం ఉండే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వారంలో ఒకసారి రూ.600నుంచి రూ.800ల వరకు చెల్లించి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి తమ ట్యాంక్‌ల్లో నింపుకొని వాడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పైపులైన్లకు మరమ్మతులు చేయించి నీటిసమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా పాదపూజ మహోత్సవం


తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న ఎంవీఆర్ విద్యార్థులు

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని ఎంవీఆర్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం పాదపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిగామ బ్రహ్మశ్రీ కుమార్ పండిట్ నేతృత్వంలో టెన్త్ విద్యార్థులతో తల్లిదండ్రులకు పాదపూజ జరిపించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కొలనుపాక గీతరవికుమార్ మాట్లాడారు. 8ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాతృనాయక్, ఏపీపీ కె.వెంకటరమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగవైకల్యాన్ని జయించి..

- ఆశ్రమంలో ఉంటూ పీజీ పూర్తి
- దివంగత సీఎం రాజశేఖరరెడ్డి సహకారంతో ఐకేపీ కమ్యూనిటీ కో ఆర్డినేటర్‌గా ఉద్యోగం
- ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్న ఏపూరి జ్యోతి

తిప్పర్తి : అయినవారు ఆదరించకున్నా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోంది తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన ఏపూరి జ్యోతి. చిన్నతనంలోనే పోలియో సోకడంతో జ్యోతికి రెండు కాళ్లు పడిపోయాయి. ఆస్ట్రేలియాకు చెందిన క్లారా ఈటెన్ అనే మహిళ ఖమ్మం పట్టణంలో సెయింట్ మేరీ పోలియో కేంద్రాన్ని ఏర్పాటు చేసి దివ్యాంగులను ఆదరించి విద్యనందిస్తుండడంతో జ్యోతిని అక్కడ తల్లిదండ్రులు చేర్పించారు. ఆశ్రమంలోనే ఉంటూ జ్యోతి పీజీ పూర్తి చేసింది. అనంతరం ఇండ్లూరు గ్రామానికి చేరుకుంది. తన జీవనం ఎలా సాగుతుందనే బెంగతో కాలం వెళ్లదీస్తూ ఉద్యోగ అన్వేషణ ప్రారంభించింది.

సీసీగా ఉద్యోగం..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పల్లెబాట కార్యక్రమంలో భాగంగా 2004వ సంవత్సరంలో తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు గ్రామానికి వచ్చారు. ఈ సమయంలో నాటి నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో వైఎస్‌ను కలిసి తనకు ఉద్యోగం ఇప్పించాలని జ్యోతి వేడుకుంది. స్పందించిన వైఎస్.. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సీసీగా నియమించాలని అధికారులను ఆదేశించారు.


మహిళా సంఘం సభ్యులతో ఏపూరి జ్యోతి

ఉద్యోగంలో రాణిస్తున్న జ్యోతి

తిప్పర్తి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న జ్యోతి తన ఉద్యోగానికి తగిన న్యాయం చేస్తోంది. తిప్పర్తి, సిలార్‌మియాగూడెం, మర్రిగూడెం, గడ్డకొండారం, కంకణాలపల్లి గ్రామాల్లో 200 మహిళా సంఘాలను కోఆర్డినేట్ చేస్తూ వారికి రుణాలు ఇప్పించడం, రికవరీ చేయడం లాంటి పనులు చేస్తోంది. అంగవైకల్యం ఉండడంతో జ్యోతిని పెళ్లి చేసుకోవడానికి మొదట్లో ఎవరూ ముందుకు రాలేదు. జ్యోతి మేనబావ అయిన నాగరాజును 2010వ సంవత్సరంలో వివాహం చేసుకుంది. వారికి పాప ఉంది.

సంతోషంగా జీవిస్తున్నా



కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి ఉద్యోగం ఇప్పించడంతో పెళ్లి చేసుకుని సొంతంగా ఇల్లు కట్టుకుని సంతోషంగా జీవిస్తున్నా. ఆస్ట్రేలియాకు చెందిన క్లారా ఈటెన్ అమ్మగారు నన్ను ఆదరించి చదివించారు. నా భర్త నాకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

- ఏపూరి జ్యోతి